www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 జనవరి 2024
5
ఏలూరు



నేడు గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

భారత 75వ గణతంత్ర దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలు ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమవుతాయని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ జరుగుతుందని, అనంతరం పోలీసు గౌరవవందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. 9.15కు జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సందేశం ఉంటుందని పేర్కొన్నారు. 9.30కు పోలీసు కవాతు, 10 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసి ప్రగతి శకటాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 10.20కు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 10.55కు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత ఉంటుందని, 11.35కు స్టాల్స్ సందర్శన ఉంటుందని పేర్కొన్నారు.

పట్టు కోసం పాట్లు..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో రాబోయే ఎన్నికల్లో తమ పట్టు నిలుపుకునేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. గత వైభవాన్ని సాధించేందుకు టిడిపి గట్టి ప్రయత్నం చేస్తుండగా.. గత ఎన్నికల్లో వలే ఈసారీ మాదే ఆధిక్యమని అధికారపక్షమైన వైసిపి ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే టిడిపి, జనసేన సీట్ల సర్దుబాటుపై స్పష్టత లేకపోవడంతో ఎవరు ఏస్థానం నుంచి బరిలో ఉంటారో తెలియక గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎవరికి వారు జిల్లాపై పట్టు కోసం కసరత్తు చేస్తుండటంతో జిల్లా రాజకీయ రసవత్తరంగా మారింది.



పూర్వ వైభవం కోసం తెలుగు తమ్ముళ్ల తహతహ

ఈసారీ మాదే ఆధిక్యమంటున్న అధికార పక్షం

జనసేన, టిడిపి సీట్ల సర్దుబాటుపై కానరాని స్పష్టత

రసవత్తరంగా ఉమ్మడి పశ్చిమగోదావరి రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒకప్పుడు టిడిపి బలంగా ఉండేది. గోదావరి జిల్లాలే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాయనే నానుడి ఇప్పటికీ ఉంది. గోదావరి జిల్లాల్లో సత్తా చాటిన పార్టీనే అధికారం చేపడుతుందనేది అందరి నోటిమాట. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో వైసిపి సత్తా చాటింది. 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి కూటమి జనసేన మద్దతుతో జిల్లాలోని అన్నిస్థానాలనూ చేజిక్కించుకుంది. ఆ ఎన్నికల్లో వైసిపికి నిరాశే మిగిలింది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు 13 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి, పాలకొల్లు, ఉండి స్థానాల్లో టిడిపి గెలుపొందాయి. జిల్లాల విభజన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి. జిల్లాల విభజన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు కావడంతో విభజిత పశ్చిమగోదావరి జిల్లా రాజకీయం ఆసక్తికరంగా మారింది.

గోదావరి జిల్లాలపై కన్ను..

రానున్న ఎన్నికలు టిడిపికి జీవన్మరణ పోరాటంగా మారాయి. ఎలాగైనా ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టాలనేది జనసేనాని పట్టుదల. టిడిపి, జనసేన మధ్య పొత్తును ఇప్పటికే ప్రకటించి సమన్వయంతో ఎన్నికల ప్రచారాన్ని సైతం ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో అధికారం చేజిక్కించుకునేందుకు ఇరుపక్షాలు గోదావరి జిల్లాలపై కన్నేశాయి. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన జిల్లాపై పట్టు సాధించేందుకు సీట్ల సర్దుబాటు దగ్గర నుంచి అభ్యర్థుల ఎంపిక వరకూ అన్ని అంశాలనూ క్షుణ్ణంగా పరిగణలోకి తీసుకుంటున్నాయి. ఉమ్మడి అభ్యర్థులను పోటీలో నిలిపే చోట సామాజిక తరగతుల బలబలాలు, వైసిపి అభ్యర్థులపై వ్యతిరేకత, అభ్యర్థుల ఆర్థిక బలబలాలపై అంచనాలు రూపొందిస్తున్నారు.

పొత్తుతో త్యాగం తప్పదా..!

ఎన్నో ఆశలతో పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగుతున్న టిడిపి, జనసేన ఎవరు ఏ స్థానం నుంచి రంగంలో ఉంటారనేది తేలకపోవడం ఇరుపార్టీల శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. జనసేన మూడు సీట్లు ఆశించే అవకాశం కనిపిస్తోంది. ఎక్కువ సీట్లు ఆశించినా ఆ సంఖ్యకే పరిమితమవుతుందని తెలుస్తోంది. మిగిలిన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో టిడిపి బరిలోకి దిగుతుందని చర్చ సాగుతోంది. భీమవరం అసెంబ్లీ సీటు కోసం జనసేన పట్టుబడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఆయన ఇక్కడ నుంచి మళ్లీ పోటీ చేసే అవకాశం ఉందా, లేక వేరే అభ్యర్థిని బరిలోకి దింపుతారా అనేది తేలాల్సి ఉంది. ఏదేమైనా ఇక్కడ టిడిపి ఆశావహులు త్యాగం చేయక తప్పని పరిస్థితి కన్పిస్తోంది. నరసాపురం అసెంబ్లీ స్థానాన్నీ జనసేన కోరుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ జనసేన రెండోస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో జనసేన కోరిక మేరకు ఈ సీటు ఇచ్చేస్తే ఇక్కడి టిడిపి ఆశావహుల ఆశలన్నీ గల్లంతే. తాడేపల్లిగూడెం స్థానం కోసం కూడా జనసేన పట్టుబడుతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఆ పార్టీకి మూడోస్థానం దక్కింది. అయితే అంతకుముందు ఇక్కడ పిఆర్‌పి విజయఢంకా మోగించింది. అయితే ఇక్కడ 2004 నుంచి టిడిపికి కలిసిరావడం లేదనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సీటు జనసేనకు వదిలేసే అవకాశం ఉందని టిడిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

టిడిపి కచ్చితంగా బరిలోకి దిగే స్థానాలు..

జిల్లాలో ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు స్థానాల నుంచి టిడిపి కచ్చితంగా బరిలోకి దిగనుంది. ఈ సీట్లను టిడిపి వదులుకునే పరిస్థితి లేదు. ఉండి, పాలకొల్లు టిడిపికి బలమైన స్థానాలు. గత ఎన్నికల్లో వైసిపి ప్రభంజనాన్ని సైతం తట్టుకుని టిడిపి ఈ స్థానాల్లో గెలుపొందింది. ఆచంట, తణుకుల్లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ టిడిపికి బలమైన అభ్యర్థులు ఉన్నారు. ఇక అధికార పక్షమైన వైసిపి జిల్లాలో అభ్యర్థులను ఒకటి, రెండుచోట్ల మినహా పెద్దగా మార్చే అవకాశం ఉండదనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న సిట్టింగులకు ఆయాస్థానాలే కాకపోయినా వేరేచోట కచ్చితంగా టిక్కెట్ దక్కుతుందనే ప్రచారం సాగుతోంది. ఏదేమైనా కాంగ్రెస్ రాక, తదితర పరిణామాల నేపథ్యంలో జిల్లా రాజకీయం రసవత్తరంగా మారింది.

ప్రాణం తీసిన పానీపూరీ..!

- గంటల వ్యవధిలో కడుపునొప్పితో అన్నదమ్ముల మృతి
- ఫుడ్ పాయిజనే కారణమని అనుమానాలు
- జంగారెడ్డిగూడెంలో పెను విషాదం



మృతి చెందిన చిన్నారులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (టి.నర్సాపురం)

అప్పటి వరకూ ఆడుతూ.. పాడుతూ తిరిగారు తల్లిదండ్రులతో కలిసి పానీపూరీ తిన్నారు. ఆపై ఇంటికెళ్లి కొద్దిసేపటి తర్వాత భోజనం చేసి పడుకున్నారు. నిద్రలోనే తీవ్ర అస్వస్థతకు గురైన వారు తెల్లవారేసరికి విగత జీవులయ్యారు. చిన్నారుల మృతికి ఫుడ్ పాయిజనే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నదమ్ములైన బి.రామకృష్ణ (11), విజయ్ (6) కడుపునొప్పితో గురువారం ఉదయం గంటల వ్యవధిలో మృతి చెందడం జంగారెడ్డిగూడెంలో తీవ్ర విషాదాన్ని, ఆందోళనను రేకెత్తించింది.

ఈ ఘటనకు సంబంధించి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన బేలపాటి రవి, చిన్న జమక్క భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు రామకృష్ణ (11), విజయ్ (6) ఉన్నారు. ఈ కుటుంబం రిక్షాపై తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని జీవనం సాగిస్తోంది. రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చిన వీరు ఏలూరు రోడ్డులోని రామచంద్రపురంలో ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు. ఎప్పటిలానే ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని స్థానికంగా విక్రయించాక బుధవారం సాయంత్రం ఏలూరు రోడ్డులో ఉన్న పానీపూరీ బండి వద్దకు తమ ఇద్దరు కుమారులతో కలిసి వెళ్లి పానీపూరీ తిన్నారు. అనంతరం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు చిన్న కుమారుడు విజయ్‌కు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో రాజమండ్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే సమయంలో ఉదయం 6:30 గంటల సమయంలో పెద్ద కుమారుడు రామకృష్ణ కూడా కడుపునొప్పి వస్తుందనడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో కామవరపుకోట వెళ్లేసరికి మతి చెందినట్లు బంధువులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే డిఎస్‌పి ధనుంజయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారులు తిన్న ఆహారాన్ని సీజ్ చేసి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పొట్టికూకోసం వచ్చిన కుటుంబం ఇద్దరు చిన్నారులను కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది.



మృతుల తల్లిదండ్రుల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మృతుల కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

సిపిఎం ఆందోళన


ఫుడ్ పాయిజన్ అయ్యి మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ నేతలు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. అనంతరం పట్టణంలో ఇష్టానుసారంగా ఆహార పదార్థాల విక్రయాలు సాగుతున్నా మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదంటూ ఆందోళన చేపట్టారు. బి.రాంబాబు అధ్యక్షతన చేపట్టిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి జీవరత్నం మాట్లాడారు. పట్టణంలో ఆహార పదార్థాల అమ్మకాలపై సరైన నిఘా లేదని, నిల్వ ఉంచిన పదార్థాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులకు ఏమీ పట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు ఎ.ప్రభాకర్‌రావు, యాగంటి సీత, జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు, పి.చంటి పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి, జనసేన బిజెపి తొత్తులే

ప్రత్యేక హోదాపై ఆ పార్టీలు మోసగించాయి - పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, దాని మిత్రపక్షం జనసేన బిజెపి తొత్తులేనని, వాటికి ఓట్లేస్తే బిజెపికి వేసినట్లేనని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో వైసిపి, టిడిపి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసగించాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదా దక్కుతుందన్నారు. గురువారం ఏలూరు వచ్చిన షర్మిల ఆశ్రం ఆసుపత్రి వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అనంతరం ర్యాలీగా ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ నుంచి గన్ బజార్, ఆదివారపుపేట, తంగెళ్లమూడి సెంటర్, కండ్రికగూడెం సెంటర్ మీదుగా చింతలపూడి రోడ్డులోని సుఖీభవ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక హోదా కోసం పోరాడిన వాళ్లను చంద్రబాబు జైల్లో పెట్టించారని విమర్శించారు. ప్రత్యేక హోదా తాను తెస్తానని ఎన్నికల ముందు పాటపడిన జగన్ అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైసిపి, టిడిపి బిజెపి కనుసన్నల్లో పని చేస్తున్నాయన్నారు. అలాంటి పార్టీలను నమ్మవద్దని హితవు పలికారు. ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్, పోలవరం విషయంలో 22 మంది వైసిపి ఎంపీలు ఎందుకు మూకుమ్మడి రాజీనామాలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. జగన్ అప్పు తెచ్చారు...అభివద్ధి ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబు అమరావతి అని చెప్పి సింగపూర్ కడతానని గ్రాఫిక్స్ చూపించారని, జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కదానిని ఏర్పాటు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, రానున్న 70 రోజులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని కోరారు. కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతుందో వివరించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామన్నారు. సమావేశంలో నేతలు, మాజీ మంత్రులు జెడి.శీలం, పల్లంరాజు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, అమర్ జహగేగ్, లాం తాంతియా, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మార్నీడి బాబ్జి, దంపుబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షర్మిల

కొనసాగిన సెర్ఫ్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెర్ఫ్ ఉద్యోగుల జెఎసి చేపట్టిన నిరవధిక సమ్మె ఏలూరు కలెక్టరేట్ వద్ద రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్.సుబ్బారావు మాట్లాడుతూ కేడర్లు, పేస్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, ఫైనాన్స్ డిపార్టుమెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరు చేయబడిన పోస్టులపై వెంటనే జిఒ ఇవ్వాలని కోరారు. ప్రస్తుత సీలింగ్ విధానానికి బదులుగా నూరుశాతం బేసిక్ పేపై ఇపిఎఫ్ కంట్రీబ్యూషన్ అమలు చేయాలని, రిజర్వేషన్ల నియమాన్ని సక్రమంగా వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెఎసి మెంబర్ కన్వీనర్ హేమంత్ కుమార్, కన్వీనర్ బాపూజీ, గోపి, అనిత, లతా, విజయ కుమారి పాల్గొన్నారు.



నినదిస్తున్న సెర్ఫ్ ఉద్యోగులు

దోసపాడులో మళ్లీ ఉద్రిక్తత

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ చట్టాలు పేదలకేనా.. భూస్వాములకు వర్తించవా..?

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి

ప్రజాశక్తి - దెందులూరు

పేదలకు జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న భూములను విడగొట్టి, సర్వే చేసి మిగిలిన భూములు అసలైన అసైన్‌దారులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో చేపల చెరువు వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరువులో నీటిని వెళ్లగొట్టి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి మాట్లాడుతూ జిల్లా, మండల రెవెన్యూ అధికారులు పేదలు, దళితుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 144, 145 సెక్షన్లు పేదలకే వర్తిస్తాయా, భూస్వాములకు వర్తించవా అని ప్రశ్నించారు. పేదలు చెరువుల దగ్గరికి వెళ్లిన ప్రతిసారీ రెవెన్యూ అధికారులు రాకుండా పోలీసులను పంపించి భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. పేదల పట్ల ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూరికార్డులను తారుమారు చేస్తున్న వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అసలైన అసైన్డ్‌దారులు దోసపాడు పేదలైతే ఈ భూములు దేవినేని భాజీ ప్రసాద్ బినామీలకు ఏవిధంగా చెందుతాయని ప్రశ్నించారు. 30 ఏళ్ల క్రితం పేదలను దేవినేని భాజీ ప్రసాదు, ఆయన బినామీలు బెదిరించి పేదల నుండి భూములను బలవంతంగా లాక్కున్నా ఇంతవరకూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూస్వామి చేతుల్లో ఉన్న ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అసలైన అసైన్డ్‌రులకు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. అసలైన అసైన్డ్‌దారులను భూముల్లోకి రాకుండా పోలీసులు అడ్డగించడం సిగ్గుచేటన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న అసలు భూములు విడదీసి మిగిలిన అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, పేదలు, దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ అధికారులు అసైన్డ్, సీలింగ్ భూముల వివరాలు బయటపెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న భూములు మినహా మిగిలిన అసైన్డ్, సీలింగు, గయ్యాల భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దెందులూరు ఎస్ఐ పేదలను అరెస్టు చేయాలని ప్రయత్నించడం సిగ్గు చేయటన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనంద్‌రావు, సిహెచ్.మణి, టి.నాగేంద్ర, భూపోరాట నాయకులు ఏసు మణి, మాణిక్యం, లక్ష్మి, మరియమ్మ, కుమారి, హేమలత పాల్గొన్నారు.



నేతలతో పోలీసుల వాగ్వివాదం

యుటిఎఫ్ ఆధ్వర్యాన మున్సిపల్ టీచర్ల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడలో రాష్ట్రస్థాయి మున్సిపల్ టీచర్ల ధర్నాకు అనుమతి ఇచ్చి రద్దు చేయడం, మున్సిపల్ ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫాలీ, రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల వల్లే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని అధికారులు చెప్పటం సరైన కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకదుర్గ, కోశాధికారి రంగమోహన్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు పాల్గొన్నారు.



నినదిస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

ఓటుహక్కు వినియోగం ప్రతిపౌరుని బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతిఒక్క పౌరుని బాధ్యతని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, ప్రజలు ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఉత్తమ నాయకత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. ప్రతిఒక్కరూ తమ హక్కులతోపాటు తమ బాధ్యతలు కూడా తెలుసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు రాలేని కదలలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇంటి వద్దే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ కొత్తగా నిర్ణయం తీసుకుందన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ద్వారా జిల్లాలో 16.24 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారని, మార్పులు, చేర్పులకు లక్షా 93 వేల 870 మంది దరఖాస్తు చేసుకోగా వాటిలో అర్హులైన దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ జాబితాలో తమ ఓటును పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వారి పేర్లు కొత్తగా నమోదుకు పోలింగ్ తేదీకి ముందు 10 రోజుల వరకు నమోదు చేసుకున్నవారు పేర్లు సప్లిమెంటరీ జాబితాలో ప్రచురించడం జరుగుతుందని, వారు ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. 85 నుండి 90 శాతం వరకు పోలింగ్ జరిగితే ఉత్తమమైన నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ 'ఓటు హక్కు వినియోగించుకోవడం కంటే ముఖ్యమైన పని లేదు.. నేను వినియోగించుకుంటాను' అనే నినాదంతో ఓటు హక్కు వినియోగంపై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎటువంటి ఒత్తిళ్లకూ ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామని సభికులచే కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 80 సంవత్సరాల వయస్సు నిండి ప్రతి ఎన్నికల్లోనూ ఓటు హక్కు వినియోగించుకుంటున్న ముద్దం సుబ్బారావు (101 సంవత్సరాలు), దాట్ల శేషమరాజు, దేవరపల్లి కుటుంబరావు, పొన్నగంటి సూరమ్మ, మల్లెమొగ్గల సత్యనారాయణ, ముంతా విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతులు భీముని రమేష్‌లను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పూలమాల, శాలువా, మెమెంటోతో సత్కరించారు. నూతనంగా ఓటరుగా నమోదైన ఐదుగురు విద్యార్థులకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



సీనియర్ ఓటర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రమాదాల నివారణకు చర్యలు : ఆర్ఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసిలో ప్రమాదాల నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం సంక్రాంతి సందర్భంగా జిల్లాలో ఆర్‌టిసికి రెట్టింపు ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరం సంక్రాంతి సందర్భంగా 14 రోజులు 37 బస్సులు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు నడపగా ఈ సంవత్సరం ప్రజల రద్దీని బట్టి 580 బస్సులు నడిపామని, రూ.కోటీ 20 లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు. వచ్చే శివరాత్రి, ఇతర ప్రత్యేక పండుగలకు కూడా ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ప్రమాద రహిత మాసోత్సవాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని, గ్యారేజ్ నిర్వహణ నుంచి ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు ప్రమాదాలపై ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి డ్రైవర్లకు రూట్‌మ్యాప్ అందజేస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో జాగ్రత్తగా బస్సు నడపాలని సూచిస్తున్నామని తెలిపారు. ఉత్తమ రికార్డు ఉన్న డ్రైవర్లను గుర్తించి డిపో స్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో ముగ్గురికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు.

గెలుపొందిన విద్యార్థులకు చెక్కుల అందజేత

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలను బతకనిద్దాం-చదవనిద్దాం అనే నినాదంతో లింగ నిష్పత్తి పెంచడం, బాలికాభ్యున్నతి పెంపొందించే విధంగా చేపట్టిన చర్యలలో భాగంగా గురువారం కలెక్టర్ ఛాంబర్లో ఏలూరు, నూజివీడు డివిజన్లోని హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ప్రతి కేటగిరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ బహుమతికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతికి రూ.3 వేలు, తృతీయ బహుమతికి రూ.2 వేలు చొప్పున చెక్కులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా గెలుపొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్.శర్మిష్ఠ, డిసిపిఒ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆగిరిపల్లి : మహిళల ఆర్థిక పరిపుష్టిని పెంపొందించడమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఆగిరిపల్లి మండలంలో 1,237 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.12 కోట్ల 55 లక్షల 67 వేలు నాల్గవ విడత ఆసరా కార్యక్రమంలో పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పేదలకు ఎనలేని సేవలందించారు : దేవేంద్ర

ముసునూరు : పరిటాల రవి కమ్యూనిస్టు నాయకుడిగా, టిడిపి నాయకుడిగా పేదలకు ఎనలేని సేవలు అందించాడని రాష్ట్ర టిడిపి నాయకులు కూచిపూడి దేవేంద్ర పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చెక్కపల్లి గ్రామంలో పరిటాల రవి 19వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షులు కంచర్ల సత్యనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ, కాటేపల్లి శివ, చిలుకూరి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఉదయ భాస్కర్‌కు ఉత్తమ బిఎల్ఒ అవార్డు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం అక్కుపల్లిగోకవరం గ్రామ రెవెన్యూ అధికారి ఎంవిఎన్ఎస్.ఉదయ భాస్కర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ బూత్ లెవెల్ అధికారి (బిఎల్ఒ)గా ఎంపికయ్యారు. గురువారం విజయవాడలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మెమెంటో, ప్రసంశాపత్రంతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా, ఓటుకు ఆధార్ సీడింగ్‌లో పనితీరుకు ఈ అవార్డు వచ్చింది.

ఇవిఎంతో ఓటు వేసే విధానం ప్రదర్శన

నూజివీడు రూరల్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఎలక్షన్ కమిషన్, ఉన్నతాధికారుల ఆదేశంతో గురువారం ఈవిఎంపై ఓటింగ్ వేసే విధానాన్ని ప్రదర్శించారు. ఈవిఎం పనిచేసే విధానం, ఓటు వేయడం, వివి పాట్‌లో ఓటు నమోదు కావడం, వేసిన ఓటును పరిశీలించుకునే అవకాశాన్ని కల్పించడం వంటి వివరాలను ఓటర్లకు తెలియజేశారు. ఈ ప్రదర్శన మొత్తం సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జరిగింది.

వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

చింతలపూడి : 2024 ఎన్నికలో వైసిపిని అత్యధిక మోజారిటీతో గెలిపించి, ముఖ్యమంత్రిగా మరోసారి జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. పట్టణంలో వికేఎం ఫంక్షన్ హాల్‌లో పరిచయ వేదికను గురువారం ఏర్పాటు చేశారు. చింతలపూడి ఇన్‌ఛార్జి కంభంపాటి విజయరాజు, కానుమూరి సునీల్ కూమర్ లింగపాలెం మండల కార్యకర్తలు, నాయకులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రచారం చేస్తామని, అభ్యర్థులను గెలుపించుకుంటామని తెలిపారు. ప్రజలకు సేవ చేయలనే లక్ష్యంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల కన్వీనర్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్, ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలకు మోడీ తూట్లు

టి.నరసాపురం : కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల ఉపాధికి గండి కొట్టారని మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాము, సతీష్ దుయ్యబెట్టారు. మండలంలోని మక్కినవారిగూడెంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ముఠా వర్కర్లు మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరికీ కనీస వేతనం ప్రభుత్వం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, హమాలీ వర్కర్ సీనియర్ నాయకుడు మల్లెల సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరయ్య మృతి బాధాకరం

ఏలూరు అర్బన్ : ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త, కళాపోషకులు, కళాభిమాని, హిందూ యువజన సంఘం(వైఎంహెచ్ఎ) మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు శలా కోటి వీరయ్య బుధవారం ఆకస్మికంగా మృతి చెందడం పట్ల హిందూ యువజన సంఘం పాలకవర్గం తమ సంతాపాన్ని తెలిపింది. వారి కుటుంబ సభ్యులకు సంస్థ పక్షాన తమ సానుభూతిని తెలియజేశారు. వైఎంహెచ్ఎ మేనేజ్మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కోశాధికారి గాధంశెట్టి శ్రీనివాసరావు సంతాపాన్ని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - వేలేరుపాడు


తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పెద్దఎత్తున అధిక లాభాలకు విక్రయిస్తున్న కట్కూరు గ్రామానికి చెందిన ముత్తుబోయిన రాంబాబు నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ గురువారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో సమ్మక్క సారక్క బ్రాందీ షాప్ నుంచి మద్యం కొనుగోలు చేసి, అతని సొంత గ్రామమైన కట్కూరులో ఇంటి వద్ద పెట్టుకొని గోదావరిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, గ్రామస్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడని విచారణలో వెల్లడైందన్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి, ఇతని వద్ద నుంచి ఎమ్‌హెచ్ 144, ఒఎబి 120, బీర్లు 371 మొత్తం 635 బాటిల్స్ సీజ్ చేశామన్నారు. వాటి విలువ రూ.99,440 ఉంటుందని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలియజేశారు.

జీలుగుమిల్లి : ద్విచక్ర వాహనంపై అక్రమంగా తెలంగాణ నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తాటియాకుల గూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి ఆంధ్రకు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ఘనంగా ఓటర్ల దినోత్సవం



పోలవరం: సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న సూర్యతేజ

ప్రజాశక్తి - పోలవరం

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ సూర్య తేజ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలవరం మండలంలో స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటిడిఎ పిఒ సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్డిఒ కె.అద్దయ్య పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను, జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకరవెంకటరెడ్డి, పంచాయతీ ప్రెసిడెంట్ పాదం పుష్ప పాల్గొన్నారు.

ముసునూరు : ఓటుహక్కు ఓటర్లకు వజ్రాయుధం లాంటిదని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రమణక్కపేట హైస్కూల్లో విద్యార్థులచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కాట్రేనిపాడులో అధికసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వారిని ఘనంగా సన్మానించారు. ముసునూరులో ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను ఘనంగా సన్మానించారు.

టి.నరసాపురం : ఓటుహక్కు వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి వుండాలని తహశీల్దార్ జెవి.సుబ్బారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. మండలంలోని మర్రిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపల్ భాస్కరరావు ఆధ్వర్యంలో అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కుల, మత, లింగ వివక్షత లేకుండా 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాం ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు బివిఎల్.స్వామి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పుట్టల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్‌విఎ.కృష్ణారావు, కె.కుటుంబరావు, శ్యామ్ ప్రకాష్, వీరాస్వామి, దుర్గారావు పాల్గొన్నారు.

చింతలపూడి : 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఇఆర్ఓ కె.గీతాంజలి అన్నారు. మండలంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఎంపిడిఒ కార్యాలయం వద్దకు వచ్చి, జూనియర్ కళాశాల మైదానంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ ఓటర్స్ డే సందర్భంగా గురువారం సీనియర్ సిటిజెన్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఓటు ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు వజ్రాయుధమవుతుందని, దేశ ప్రగతిని నిర్దేశించేదుకు ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం ప్రధానమైన పాత్రను పోషిస్తుందన్నారు.


చాట్రాయి : ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఓటరు చేతిలో ఉన్న వజ్రాయుధం లాంటిదని జిల్లా ప్రధాన కార్యదర్శి మోరాపూడి శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం ఉదయం మండలంలోని చనుబండ గ్రామంలో 3వ నెంబరు పోలింగ్ బూత్ వద్ద బిఎల్ఒల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేసి సీనియర్ ఓటర్లు పోగిడిపోల వెంకటేశ్వర రావు, గమిడిమిల్లి శ్రీరాములును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోరాపూడి సత్యనారాయణ, పరసా శ్రీనివాస రావు, బిఎల్ఒలు, విఆర్ఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చాట్రాయిలో గ్రామ సర్పంచి దామెర ఉష గ్రామ సచివాలయం వద్ద సీనియర్ సిటిజనులను సన్మానించారు.

జీలుగుమిల్లి : 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుందర్ సింగ్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్ఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

పోలవరం : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను ఆధ్వర్యంలో గురువారం ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ సిహెచ్.శ్రీనివాస్ బాబు, ఎపిఒ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

తానేటి వనితకు ఘన స్వాగతం

ద్వారకాతిరుమల : గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా ద్వారకాతిరుమల వచ్చిన హోమ్‌మంత్రి తానేటి వనితకు ఘన స్వాగతం పలికారు. పొలసానిపల్లి నుంచి భారీ బైక్ ర్యాలీతో ద్వారకాతిరుమల చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి, రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం సభాస్థలికి చేరుకున్నారు. సభా ప్రాంగణం జన సందోహంతో కిక్కిరిసి పోయింది. పెద్ద ఎత్తున మహిళలు, డ్వాక్రా గ్రూపులు వారు పాల్గొన్నారు. తానేటి వనిత మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాను పుట్టినిల్లు అయిన గోపాలపురం నియోజకవర్గంకి తిరిగి వచ్చానని, రాబోయే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ఈ సభలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు పాల్గొన్నారు.



సభలో వనిత, నేతలు

ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ద్వారకా తిరుమల : ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో రైతు సంఘం నాయకులు పర్యటన చేసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు వల్ల ఆయిల్ పామ్ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. 46 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని కేంద్రం పూర్తిగా ఎత్తివేయడం వల్ల క్రూడ్ పామాయిల్ దిగుమతి అవడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర తగ్గిపోయి రైతులు నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. గత ఏడాది టన్ను గెలల ధర రూ.23 వేలు ఉండగా రూ.12,400లకు పడిపోయిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు రీత్యా రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర కోసం ఆయిల్ పామ్ రైతులు ఆందోళనలకు సమాయత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సన్మానం

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గత 42రోజులుగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె విజయవంతం కావడంలో భాగంగా గురువారం సాయంత్రం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నమ్మ, పుల్లమ్మ, అనురాధ, ఈశ్వరమ్మ, రాజకుమారి, రాజ్యలక్ష్మీలను సన్మానించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు ముత్యాల నరేష్, జహంగీర్ బాషా, అయ్యప్ప, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి ఎస్ఐగా కుటుంబరావు నియామకం

ముసునూరు : చింతలపూడి ఎస్ఐగా ఎం.కుటుంబరావుని నియమించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ముసునూరు మండల ఎస్ఐగా పనిచేస్తున్న కుటుంబరావు ఎన్నికల బదిలీలో భాగంగా చింతలపూడి ఎస్ఐగా బదిలీ అవుతున్నట్లు సమాచారం. ఈయన గతంలో లక్కవరం, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు.

భూయాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

ఏలూరు అర్బన్ : భూ యాజమాన్య హక్కు చట్టం 2022ను రద్దు చేయాలని, చట్టం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 512, 630లను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ యాజమాన్య హక్కు చట్టం 2022ను రద్దు చేయాలని ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం సిపిఐ, ఎఐటియుసి, బికెఎంయు నాయకులు సందర్శించి, న్యాయవాదుల దీక్షలకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం కనుసన్నలలో పనిచేస్తున్న నీతి అయోగ్ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకొని భూ యాజమాన్య హక్కు చట్టం 2002ని తీసుకొచ్చిందని చైతన్య విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఏలూరు అర్బన్ : 2023వ సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన విజయవాడ, ఏలూరు, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రిలో నిర్వహించిన జాతీయ స్థాయి నాలెడ్జ్ ఎసెస్మెంట్ టెస్ట్‌లో స్థానిక బాలాజీ నగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 33 మంది విజయం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. ఇందులో ఐదుగురు నగదు పురస్కారం, 12 మంది బంగారు పతకాలు, సర్టిఫికెట్స్, 16 మంది మెరిట్ సర్టిఫికెట్ సాధించారని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థులకు ప్రిన్సిపల్ సత్యనారాయణ, డీన్ సుధాకర్ బహుమతులు అందచేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హర్ ఘర్ జల్ గ్రామంగా కోడూరు

ముదినేపల్లి : మండలంలోని కోడూరు గ్రామం హర్ ఘర్ జల్ గ్రామంగా ఎంపికైంది. గురువారం గ్రామంలో గ్రామ సర్పంచి ఎ.కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో జల జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ సిరిగిరి శ్రీనివాసరావు ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా సిరిసిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛమైన మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలని, అలాగే పారిశుధ్య నిర్వహణ, పైప్ లైన్ లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, గ్రామ ఎంపిటిసి రంగనాయకమ్మ పాల్గొన్నారు.

వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు : వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో నిరంతరం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు అందరికి అందేవిధంగా అహర్నిశలు కృషి చేస్తున్న వాలంటీర్లతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. వారి సేవలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాలంటీర్లకు వేతనాలు పెంచాలని తెలిపారు.

టిడిపి, జనసేన ఆత్మీయ సమ్మేళనం

ముదినేపల్లి : మండలంలోని వాడపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం టిడిపి జనసేనల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ జనసేన, టిడిపి నాయకులు దావు నాగరాజు, చలసాని జగన్ మోహన్ రావు, పైడిపాటి శంకర్ పాల్గొన్నారు.

ఎఫ్‌సిజె -11 తోటల పరిశీలన

జీలుగుమిల్లి : ఉత్తర ప్రాంతపు తేలిక నేలల స్వభావాన్ని బట్టి సిటిఆర్ఐ శాస్త్రవేత్తలచే నూతనంగా ప్రవేశపెట్టిన ఎఫ్‌సిజె-11 రకం పొగాకు పంటలను ఆ సంస్థ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్, శాస్త్రవేత్తల బృందం గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు గతంలో సాగుచేసే సిహెచ్-3 వంగడాల కంటే ఈ మొక్కలు ఎత్తుగా ఎదిగి నాణ్యంగా మెరుగైన ఆకులతో ఉండటంతో హర్షం వ్యక్తం చేశారు. తోటలు ఈవిధంగా పెరగడం వల్ల రైతులకు నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని సూచించారు. అనంతరం సిటిఆర్ఐ డైరెక్టర్ శేషు మాధవ్ మాట్లాడుతూ ఉత్తర ప్రాంత తేలిక నేలల స్వభావాన్ని బట్టి వివిధ రకాల వంగడాలపై పరిశోధనలు జరిపి, అనంతరం ఎఫ్‌సిజె-11 రకం అయితే సాగుకి మంచి అనువైన రకం అని ఆ వంగడాన్ని ఇక్కడ ప్రవేశ పెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ హెడ్స్ సరళ, రాజశేఖర్, ప్రసాద్, సుబ్బయ్య, కస్తూరి, ఫామ్ అసిస్టెంట్ మేనేజర్‌లు రమేష్, సింహాచలం, సిటిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మండవల్లి : విద్యార్థులు తీసుకునే ప్రతి నిర్ణయం ఉన్నత శిఖరాలను చేరుకునే విధంగా ఉండాలని ప్రొఫెసర్ సుధా బత్తుల విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కానుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య ఉపాధి వృత్తి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పాస్ అయిన తర్వాత తీసుకునే నిర్ణయం ఉజ్వల భవిష్యత్తుకు పునాదిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు మాధవ కుమార్, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, శివకుమార్, భాగ్య కుమారి పాల్గొన్నారు.

రేపు ముదినేపల్లిలో మాదిగల మేలుకొలుపు సభ

ముదినేపల్లి : ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో శనివారం ఉదయం 10 గంటలకు మాదిగల మేలుకొలుపు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ముదినేపల్లి మండల ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ పి.ప్రసాద్ తెలిపారు. ముదినేపల్లిలోని పూర్ణిమ థియేటర్ సమీపంలోని గుడిపూడి జోషి ఇంటి ఆవరణంలో సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు సంబంధించి తొలుత మాదిగల మేలుకొలుపు అనే పోస్టర్ ఆవిష్కరించారు.

4న రాష్ట్ర గ్రామీణ వైద్యుల మహా సదస్సు

ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమలలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ద్వారాతిరుమల, కామవరపుకోట యూనిట్స్ కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ మీటింగ్ మండల కన్వీనర్ ములకాలు పానకాల అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయరాం హాజరై ఫిబ్రవరి 4న విజయవాడలో రాష్ట్ర గ్రామీణ వైద్యుల మహాసదస్సు, క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు తప్పకుండా గ్రామీణ వైద్యులందరూ హాజరు కావలసిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XV ADDL DISTRICT JUDGE :: AT NUZVID ::
PUBLICATION OF NOTICE UNDER ORDER 5 RULE 20 OF C.P.C
IA. NO: 1467 OF 2023 IN
G.L.No. : 3509 OF 2023 IN
IA. NO: OF 2023 IN OS: 68 OF 2017

BETWEEN
Noel Harper - Petitioner / Defendant
AND
Ponnam. Nagaraju & Others - Respondants / Plaintiffs

Notice to : Ponnam . Haribabu, S/o Late Ramachandraiah, Aged 39 years, Flat No. 106, Ammapadam Apartment, Near Darga, Bhavanipuram, Vijayawada, Krishna District.

PETITION FILED UNDER ORDER XVI RULE 1A r/w 151 CPC

Whereas it is proved to the satisfaction of the court that the GPA Ponnam Haribabu who instituted the suit on behalf of Plaintiffs, notices cannot be served in the ordinary way of service as the returned endorsements of registered posts are 'no such person in the address'. Hence, this proclamation under order 5 rule 20 of CPC is hereby is issued against him and he should appear personally or through their counsel on 30.01.2024 at 10.30 AM. Take Notice that, in default of his appearance on the day before mentioned, the above said case will be heard and determined in his absence.

Order by the court on 25-01-2024.
Forwarded by :
Murala. Gopinadh
Advocate

SD/- Hon'ble XV Additional District Judge,Nuzvid.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన ఏలూరు ఆర్.ఆర్.పేట వాస్తవ్యులు **షేక్ మస్తాన్ భాష, S/o. సిలార్** నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం,

నా క్లయింటు అంజుమన్-యి-మెఫజుల్, ఏలూరు సంస్థలో X-E.C నెంబరు అయి వున్నారు. ప్రస్తుతం ఉన్న ఎడహాక్ కమిటీ సభ్యులు సంస్థ యొక్క బైలాకు వ్యతిరేకంగా కొత్త సభ్యులకు సంస్థలో మెంబర్‌షిప్ యిచ్చినట్లు తెలియ వచ్చినది.

సదరు కొత్త సభ్యులకు మెంబర్‌షిప్ యిచ్చుటకు ఎడహాక్ కమిటీకు బైలా ప్రకారం ఎటువంటి హక్కులు లేవనియు, సదరు కొత్త సభ్యుల సభ్యత్వాలు చట్ట ప్రకారం చెల్లవనియు, సదరు కొత్త సభ్యులు జరగబోయే ఎలక్షన్ ప్రొసెస్ నందు పాల్గొనుటకు అనర్హులు అనియు, అట్లు పాల్గొనిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియచేయడమైనది.

G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

మహారాజశ్రీ కొవ్వూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

I.A. No. 479/2023
O.S. No. 390/2022

Between:
వీరమలు జ్యోతి ప్రభాకర వెంకటేశ్వరరావు **-వాది**
మరియు
బాలిన లక్ష్మి మరియు 2 ఇతరులు **-ప్రతివాదులు**

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మట్టా సుజన కి రిజిష్టర్ పోస్టు మరియు కోర్టు వారి ద్వారా దావా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా **ది. 14-2-2024వ తేదీన వాయిదా అయ్యి ఉన్నదని, ఆరోజు ఉదయం 10.30 గంటలకు** మట్టా సుజన, D/o. సత్యనారాయణ, వయస్సు 43 సంవత్సరాలు, హిందు, స్త్రీ, గృహిణి, R/o. D.No. 2-87, తారకరామ నగర్, ప్రభుత్వ జూనియర్ కాలేజి దగ్గర, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా అనువారు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ కొవ్వూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు హాజరు కావలసియున్నదని, అలా కాని పక్షమన కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

B.PRASADA RAO, Advocate
Tallapudi, Cell: 9912426144

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, పాలకోడేరు ఎ.ఎస్.ఆర్.నగర్, డోర్ నెం. 11-14 కి చెందిన దేవవరపు లక్ష్మి, తండ్రి: దేవవరపు సుబ్బారావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **M6754905** నెంబర్ గల ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి ది. 02-1-2024వ తేదీన పాలకోడేరు మెయిన్‌రోడ్డు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ తీసుకొనుటకు మోటారు సైకిల్ పైన వెళుచుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

దేవవరపు లక్ష్మి,
D/o. దేవవరపు సుబ్బారావు
డోర్ నెం. 11-14, ఎ.ఎస్.ఆర్. నగర్
పాలకోడేరు, పశ్చిమగోదావరి జిల్లా

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE: ELURU
E.P.No. 322/2011
in O.S.No.348/2007

Between :
Golla Yalamanda Rao -DHR/plaintiff
And
Sri. Lanka Srinivasa Rao and another -JDRs/Defendants

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు జెడిఆర్/ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.08-02-2024వ తేదీన ఉదయం 10-30 గం||లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. యావన్మంది వేలంపాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము : పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్-రిజిస్ట్రారు యిలాకా, ఏలూరు నగరం, టి.యస్.నెం. 1572, పాత అసెస్‌మెంట్ నెం. 3294 దాఖలా చ.గ.130లు అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8కు హద్దులు ::
దక్షిణం - శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి తాలూకు ఆస్థి
తూర్పు - డి.మధుసూధనరావు ఆస్థి
పడమర- మున్సిపల్ బజారు
ఉత్తరం - ఆర్.లక్ష్మణరావు ఆస్థి
ఈ హద్దుల మధ్య సుమారు 130 చ.గ.ల ఇంటి స్థలం, అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.
డిహెచ్ఆర్ విలువ : రూ.2,00,000/-
అమీనా విలువ : రూ.7,50,000/-

ఇట్లు :
ఈదుప్గంటి శ్రీనివాసబాబు,
అట్లూరి రవికుమార్,
అడ్వకేట్స్, ఏలూరు,
ఏలూరు
తేది: 22-01-2024 08812-239498

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో

F.O.P. 12/2023 in O.S. 179/2012

బిట్వీన్:
ఇండియన్ బ్యాంకు, పెదవేగి **-పిటీషనర్**
AND
శ్రీ నెక్కలపూడి సోమశేఖర్ మరియు ఇతరులు **-డిఫెండెంట్స్**

To:
R-1: నెక్కలపూడి సోమశేఖర్, S/o. రామచంద్రరావు, తాళ్ళ గోకవరం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా.

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో పైన ఉదహరించిన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం ది. 16-2-2024వ తేదీన వాయిదా అయి వున్నది. కావున 1వ రెస్పాండెంటు వాయిదా రోజు అనగా **ది. 16-2-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల 1వ రెస్పాండెంటు పరోక్షంలో ఫైనల్ డిక్రీ ఫిటీషన్ తీర్మానించబడును.

B.GOWRI SANKAR
Advocate, Eluru
Cell: 7416236226

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప||గో||జిల్లా కోర్టులో

ఈ.పి. నెం. 61/2022 ఇన్
ఓ.యస్. నెం. 436/2020

బిట్వీన్:
పడాల శ్రీనివాసరెడ్డి **-డి. హెచ్. ఆర్.**
మరియు
షేక్ సుభాన్ సాహెబ్ అనే సుభాన్ **-జె. డి. ఆర్.**

తండ్రి: షేక్ యూసఫ్ సాహెబ్, డోర్ నెం. 2-131, పంచాయితీ ఆఫీస్ వెనుక, సిద్ధాంతం - 534326, పెనుగొండ మండలం, ప||గో||జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

డి. హెచ్. ఆర్. తరఫున దాఖలు చేసిన ప్రకటన

ది. 09-05-2022 గల డిక్రీ బాకీ మీ ఆస్తి జప్తు, దర్మిలా వేలం వేసి వసూలు చేయుటకు దాఖలు చేయగా మీకు నోటీసులు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డర్ వేసినారు. కావున **ది. 19-02-2024 ఉదయం 10.30 గం||లకు** మీరు పై కోర్టు ఎదుట హాజరు కాని ఎడల మీ పరోక్షమునందు ఈపి తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు, ప||గో||జిల్లా
ది.24-1-2024 సెల్:9390018122